పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం..

జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం సంతోషాన్ని ఇస్తుందని అంకం రమేష్ అన్నారు. చింతల్‌కు చెందిన నవ్యశ్రీ అల్వాల్‌లోని లయోల కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. నిరుపేద కుటుంబం కావడంతో చదువుకునేందుకు చేయూత అందించాలని హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మూడే రవినాయక్ చెప్పడంతో రమేష్ తన పుట్టినరోజును పురస్కరించుకుని నవ్యశ్రీకి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

వరద నీటికి అడ్డుకట్ట వేయండి

కుత్బుల్లాపూర్: వర్షం పడిన ప్రతిసారి గణేష్ నగర్ ప్రాంతంలో నీరు నిలిచి ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు గురువారం కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ నరసింహను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఇంజనీరింగ్ అధికారులు హైడ్రా సిబ్బందిని సమన్వయం చేసుకొని వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నర్సాపూర్ రాష్ట్ర రహదారి చింతల్ మాంగల్య షాపింగ్ మాల్ నుంచి గణేష్‌నగర్ నాలా వరకు సమస్య తీవ్రంగా ఉందని, గతంలో ఆ ప్రాంతంలో అధికారులు పర్యటించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. చిన్నపాటి వర్షం పడినా నడవలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో చింతకుంట లింగం యాదవ్, అధ్యక్షుడు నరసింహారెడ్డి, భాస్కర్ గౌడ్, సుదర్శన్, మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాలా విస్తరణ పనులు ప్రారంభించాలి

మోతీనగర్: లక్ష్మీనగర్ నుంచి సఫ్దర్‌నగర్ వరకు రెండవ విడత ఎస్ఎన్‌డీపీ నాలా విస్తరణ పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం కోరారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎప్పుడు అకాల వర్షాలు కురుస్తాయో తెలియని పరిస్థితి నెలకొని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలా విస్తరణ పనులు శాశ్వతంగా పూర్తి అయితే ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల ప్రక్రియ (2025–26) ప్రారంభమైంది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేయగా గురువారం నామినేషన్ల ప్రక్రియను ఆరంభించారు. శుక్రవారం నామినేషన్ల దాఖలు గడువు ముగుస్తుంది. పోలింగ్ 19న..కౌంటింగ్ 20న జరుగుతుంది.

రాంరెడ్డినగర్‌లో మురుగు పరుగు

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంరెడ్డినగర్‌లో కొన్ని రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ఎక్కడ చూసినా మ్యాన్‌హోళ్ల నుంచి పొంగుతున్న మురుగునీరు, మట్టితో మూసుకుపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఔట్‌లెట్లు కనిపిస్తున్నాయి. రోడ్డుపై నడిచే వారికే కాకుండా ఇళ్లలోకి సైతం తీవ్ర దుర్వాసన వస్తుండటంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ శానిటరీ అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాంరెడ్డినగర్ అంటేనే అధికారులు చిన్నచూపు చూస్తున్నారంటూ ఇక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తూతూమంత్రంగా పరిశీలన..

కాలనీ పర్యటనకు మున్సిపల్ అధికారులు వచ్చి





నప్పుడల్లా త్వరలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పి వెళ్లడమే తప్పా అధికారులు చేసింది ఏమి లేదని ప్రజలు అంటున్నారు. సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు శానిటరీ సిబ్బంది అక్కడకు చేరుకుని శాశ్వత పరిష్కారం కాకుండా ఏదో వచ్చామా చేశామా అన్నట్లుగా పనిచేసి వెళ్లిపోతున్నారు. ముఖ్యంగా మ్యాన్‌హోళ్ల మూతలు ఏర్పాటు చేసి కొత్త యూజీడీ ఏర్పాటు చేస్తే ఇక్కడి సమస్యకు పరిష్కారం లభిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.

దోమలకు ఆవాసంగా..

రాంరెడ్డినరగ్‌లో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఏడాదిగా మురుగునీరు రోడ్లపై నిలిచి ఉండటంతో దోమలు రాత్రిపూట కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. దీనికి తోడు ఇళ్ల మధ్య పందులు సంచరిస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రాంరెడ్డినగర్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

శాశ్వతంగా పరిష్కరించాలి..



రాంరెడ్డినగర్‌లో కాలనీలో కొన్ని గల్లీల్లో రోడ్లు సరిగా లేవు. దీనికి తోడు డ్రైనేజీ వ్యవస్థ ఏడాదిగా అధ్వానంగా ఉంది. మేం పని నిమిత్తం పరిశ్రమలకు వెళ్లాలంటే మురుగునీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. అధికారులు పట్టించుకుని శాశ్వత పరిష్కారం చూపాలి.

–బర్కా, రాంరెడ్డినగర్ వాసి

ఫాగింగ్ చేయాలి..



మేము మూడేళ్లుగా ఇదే ప్రాంతంలో ఉంటున్నాం. అప్పటి నుంచి ఇదే దుస్థితి. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు విపరీతంగా కుడుతున్నాయి. దీంతో మా వీధిలో ఉండే పిల్లలు తరచూ రోగాల బారిన పడుతున్నారు. కనీసం వారానికి రెండుసార్లు ఫాగింగ్ చేయాలి.

–వాహెద్, స్థానికుడు

ప్రజలకు అందుబాటులో ఉంటా

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నానని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయానికి వచ్చిన పలు బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేజ్ – 2 సంక్షేమ సంఘం సభ్యులు తమ కాలనీలో నెలకొన్న మంజీరా నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. లీకేజీ తలెత్తిన పైప్‌లైన్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాలో అంతరాయాలు కలుగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న పద్మానగర్ ఫేజ్–2 సంక్షేమ సంఘం సభ్యులు

సూర్య ప్రభ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, రమణారెడ్డి, కాలనీ వాసులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్‌లు..

ఇబ్బంది పడుతున్న వికలాంగులు, వృద్ధులు



ఐడీపీఎల్ చౌరస్తాలో పని చేయని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్‌లు

రంగారెడ్డినగర్: ప్రధాన చౌరస్తాల్లో పాదాచారులు రోడ్డు దాటేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల లిఫ్ట్‌లు పని చేయడం లేదు.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఐడీపీఎల్ చౌరస్తా బాలానగర్–నర్సాపూర్‌రోడ్డు, జగద్గిరిగుట్ట రోడ్డుకు అనుసంధానంగా ఉంది. నిత్యం ఈ చౌరస్తా వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో పాదాచారులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకునేవి. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రూ.2 లక్షలతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. అంతే కాకుండా వికలాంగులు, వృద్ధులు, చిన్నారులతో ఉన్న మహిళలు సులభంగా బ్రిడ్జి ఎక్కేందుకు వైపు వైపులా లిఫ్ట్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటి వరకు లిఫ్ట్‌లు మాత్రం పని చేసిన దాఖలాలు లేవు. దీంతో బ్రిడ్జి ఎక్కేందుకు ఇబ్బందికరంగా ఉండటంతో పాదచారులు చౌరస్తాలో ప్రమాదకరంగా రోడ్డు దాటాల్సి వస్తోంది. ఈ విషయమై ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదు చేసినా బ్రిడ్జి నిర్వహణ హెచ్ఎండీఏ అధికారులు చూస్తున్నారని, తమ పరిధిలోని రాదని జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసినా తమకు ఉపయోగం లేదని వృద్ధులు, దివ్యాంగులు వాపోతున్నారు.

నిఘా నేత్రాల నేల చూపులు..

చింతల్: నేరాల నియంత్రణలో కీలకమైన నిఘా నేత్రాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేలచూపులు చూస్తున్నాయి. బాలానగర్ – నర్సాపూర్ రాష్ట్ర రహదారిలోని షాపూర్‌నగర్ చౌరస్తాలో సీసీ కెమెరాలు నిద్రపోతున్నాయి. చౌరస్తా నుంచి జీడిమెట్లకు వెళ్లే ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన అత్యాధునిక సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. కెమెరాలు అమర్చిన పోల్‌కు సంబంధిత వైర్ కనెక్షన్ తొలగించారు. రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా ఈ రహదారి గుండా జీడిమెట్ల పారిశ్రామిక వాడకు ఇతర రాష్ట్రాల నుండి భారీ కంటైనర్లతో పాటు కార్మికులు, వివిధ కళాశాలలకు సంబంధించిన విద్యార్థులతో పాటు పలు పాఠశాలల బస్సులు ప్రయాణం సాగిస్తుంటాయి. షాపూర్‌నగర్ నుంచి ఎడమవైపు వచ్చే వాహనాలను గుర్తించడంలో ఈ కెమెరాలే కీలకం. కానీ గత కొన్ని రోజుల క్రితం



షాపూర్‌నగర్ చౌరస్తాలో పని చేయని సీసీ కెమెరాలు

ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా కెమెరాలు ఇక్కడి నుంచి తరలించే చర్యల్లో భాగంగా కనెక్షన్ తొలగించారా లేక ఏదైనా సమస్యతో వైరు తెగిపోయిందా స్థానికులు అయోమయానికి లోనవుతున్నారు.అధికారులు జోక్యం చేసుకుని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని వాహనదారులు కోరుతున్నారు.

క్యాబ్ డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



క్యాబ్, స్కూల్ డ్రైవర్ల సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

కుత్బుల్లాపూర్: కార్మికుల పక్షాన పోరాడే ఏకైక సంస్థ ఏఐటీయూసీ అని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు యూసూఫ్ అన్నారు. గురువారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పాట్లూరి నాగేశ్వరరావు భవనంలోని కార్యాలయంలో స్కూల్, క్యాబ్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని క్యాబ్‌లు, విద్యార్థుల రవాణాకు వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వారికి ఆదుకునేందుకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. వారికి ఇన్సూరెన్స్, వైద్య సదుపాయాలు, డ్రైవర్ల పిల్లల చదువులకు ఫీజులు, ఇళ్లులేని వారికి పక్కా ఇళ్లు, 60 ఏళ్లు దాటిన డ్రైవర్లకు పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు కనీస వేతనం రూ.36 వేలు ఇచ్చేలా విద్యా సంస్థల యాజమాన్యాలను ఆదేశించాలని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రవీణ్, అధ్యక్షుడిగా శ్రీరామ్ శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షుడిగా మేకల శ్రీనివాస్, కార్యదర్శిగా మురళి, సహాయ కార్యదర్శిగా పెంటా రెడ్డి, కోశాధికారిగా గోవర్ధన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌రావులతో పాటు మరో ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, మండల అధ్యక్షుడు హరినాథ్‌రావు, దుర్గయ్య,డప్పు రామస్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో సతీష్‌సాగర్, శివాజీరాజు

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో స్థానిక సంస్థలతో పాటు ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ పార్టీ విజయ ఢంకా మోగిస్తుందని కొంపల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్ అన్నారు. గురువారం ఆయన కుత్బుల్లాపూర్ బీజేపీ కో.కన్వీనర్ శివాజీరాజుతో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కోసం అంకిత భావంతో పని చేసే ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయని, రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి కార్యకర్త కష్టపడాలని కేంద్ర మంత్రి చెప్పినట్లు సతీష్‌సాగర్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కాలనీలు బస్తీలు, మురికివాడల్లో పర్యటిస్తూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్తున్నామన్నారు. గడిచిన ఎనిమిది నెలల కాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన విధంగా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో నిరసన..

నిజాంపేట్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్ ఇంద్రన్న కాలనీ చర్చ్ గల్లీలో రోడ్డు నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరైనా సగం రోడ్డు వేసి వదిలేశారన్నారు. రోడ్డును తవ్వి వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయమై మున్సిపల్ సిబ్బందిని ప్రశ్నించగా, కాంట్రాక్టర్లు వదిలివెళ్లినట్లు సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. ఇంద్రన్నకాలనీలో డ్రైనేజీ లైన్ వేయకుండానే, డ్రైనేజీతోపాటు రోడ్డు కూడా వేసినట్లు బిల్లు పెట్టారని వారు ఆరోపించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశి యాదయ్య, పోనాకంటి దస్తగిరి, కె.మల్లయ్య, రాము, యాదమ్మ, నర్సింహా, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

గుంతల రోడ్డుతో తిప్పలు..



సుభాష్‌నగర్: నిత్యం రద్దీగా ఉండే గాజులరామారం కైసర్‌నగర్ ప్రధాన రోడ్డులో భారీ గుంతలు ఏర్పడడంతో ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కైసర్‌నగర్‌లో పలు చోట్ల రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. నాలుగు జాతీయ రహదారులను కలిపి ఈ రోడ్డు గుండా నిత్యం వంద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గుంతల కారణంగా తరచూ ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులు అవుతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



గణేష్ మండపాల నిర్వాహకులను అభినందిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్..

జీడిమెట్ల: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ఆధ్వర్యంలో గణేష్ మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు. చింతల్ ఎంపీఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డీసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండపాల వద్ద అసోషియేషన్ల ప్రతినిధులు పోలీసుల ప్రోత్సాహంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గురువారం మండపాల వద్ద వినియోగించిన సీసీ కెమెరాలను పోలీసులకు అందజేశారు. కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి, ఎస్సైలు నాయుడు, ప్రేమ్‌సాగర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సహకరించాలి



కుత్బుల్లాపూర్: వ్యాధుల నివారణలో సంక్షేమ సంఘాల ప్రతినిధులు అధికారులు, సిబ్బందికి సహకరించాలని ఉప కమిషనర్ నరసింహ అన్నారు . గురువారం ఆయన కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా ఇంటింటికి తిరిగారు. సిబ్బందితో వాటర్ ట్యాంక్, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వాటి వల్ల వచ్చే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు దోమ కాటు వల్ల వస్తాయని, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల వృద్ధి చెందుతాయని, నీరు నిలవకుండా కట్టడి చేయాలని సూచించారు. సుమారు 60 ఇళ్లను పరిశీలించి వారికి అవగాహన కల్పించారు. ఉప కమిషనర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు

సెమ్స్ ఒలింపియాడ్‌లో టీవీఆర్ విద్యార్థుల సత్తా..

జీడిమెట్ల: సెమ్స్ ఒలింపియాడ్‌లో టీవీఆర్ మోడల్ స్కూల్ విద్యార్థులు మెడల్స్, సర్టిఫికెట్స్ సాధించారు. 2024–25సంవత్సరానికి గాను టీవీఆర్ మోడల్ స్కూల్ విద్యార్థులు సెమ్స్ ఒలంపియాడ్‌లో పరీక్ష లెవెల్1, లెవెల్ 2 పరీక్ష రాయగా జాతీయ స్థాయిలో 3వ తరగతి విద్యార్థిని ఒలిన గ్రేసి రెండవ స్థానం సాధించి రూ.10వేల నగదు బహుమతి సాధించింది. దానిష్ ఖాన్‌తో పాటు మరో 17మంది విద్యార్థులు మెడల్స్, సర్టిఫికెట్స్ సాధించారు.

మంచినీటి కలుషితాన్ని అరికట్టాలి



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లోని ప్రగతినగర్ ప్రభుత్వ స్కూల్ పక్కన, రోడ్డు నెంబర్ 10లో తాగునీటి కలుషితాన్ని అరికట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కాలనీలో పర్యటించారు. మంచినీటిలో డ్రైనేజీ నీరు కలుషితమై వస్తున్నందున స్థానిక ప్రజలు రోగాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్‌వర్క్స్ డిపార్టుమెంట్‌కి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పల్లి ధర్మారావు, బాలరాజ్, పోలయ్య, కృష్ణారావు, లక్ష్మీనారాయణ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుట్టింటికి వెళ్లి వస్తానని మహిళ అదృశ్యం

మూసాపేట: పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన ఓ మహిళ తిరిగి రాని సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మూసాపేట జనతా నగర్‌లో జే. శిరీష (23), నాగసాయి భార్యాభర్తలు. ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఆదివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో తల్లి ఇంటికి వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన భర్త చుట్టుపక్కల, బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శిరీష (ఫైల్)

అభివృద్ధి పనుల్లో భాగస్వాములవ్వాలి

కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో 1 కోటి 40 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. గురువారం ప్రశాంత్‌నగర్, రామయ్య నగర్, మైత్రినగర్, దయార్‌గూడ, మాధవరం లోకయ్య పటేల్ కాలనీ, శేషాద్రినగర్‌లోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు

కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు భీమని సంతోష్, సెక్రటరీ సీహెచ్. ప్రభాకర్, బొట్టు విష్ణు, జావిద్, ప్రేమ్, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మోతీనగర్: విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ బంజారాహిల్స్ సర్కిల్ యూనియన్ అధ్యక్షుడు సంతోష్ అన్నారు. గురువారం మోతీనగర్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ బంజారాహిల్స్ సర్కిల్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి



సమస్యను పరిష్కారం అయ్యేంత వరకు కృషి చేస్తానని తెలిపారు. కార్మికులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభాకర్ రెడ్డి, అడిషనల్ సెక్రటరీగా మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు.